# కల్పవృక్ష కథన కుతూహలం

**The curious question of a Giving Tree**

ఊటుకూరి విజ్ఞానేశ్వర కుమార్

ప్రపంచంలో ఉన్న అనేక మతాల్లో సంస్కృతుల్లో కల్పవృక్షం ప్రసక్తి కనిపిస్తుందీ దాని వల్ల కాని పని లేదూ అది ఉన్న చోట కరువు కాటకాలుండవూ అన్న ప్రశస్తి వినిపిస్తుందీ. కానీ "కలదు కలదను నా వృక్షము కలదా లేదా" అని ప్రశ్న వేస్కుంటే సమాధానం మాత్రం కష్టసాధ్యం. కల్పవృక్షమంటే కేవలం అత్యంత ఉపయోగకరమైన చెట్టూ అని ఉల్పాగా ఒక నిర్వచనంఁవిచ్చి, అది **Africa** లో ఉండే **Balboa tree** అని వక్కాణించారు కొంత మంది చరిత్రకారులు. అదే సిద్ధాంతం మీద అటిటి పళ్ళూ అటిటాకులూ దూటా అన్నీ ఉపయోగించ వచ్చు కాబట్టి అది మన అటిటి చెట్టూ అని ఋజువు చేశారు మా సైన్సు మాష్టారు. తాటి దూలాలూ మట్టలూ తాటి పళ్ళూ తేగలూ బుఱ్ఱగుంజూ మళ్ళీ మాట్లాడితే తాటి కల్లూ, పైనుంచి కింద దాకా లోపల నుంచి పైదాకా అన్నీ వాడచ్చు కాబట్టి కల్పవృక్షమంటే తాటి చెట్టే అని వాదానికి దిగేవారు సోషల్ మాష్టారు. సత్య కాలంలో ఆర్యావర్తంలో ఎక్కడా అటిటి చెట్లూ లేవూ తాటి చెట్లూ లేవూ మీటిద్దటి ఉద్దేశ్యాలూ తప్పూ అని అరిచే వారు తెలుగు మాష్టారు. రామ రామ లెంపలేసుకో అది అటిటి చెట్టూ తాటి చెట్టూ కాదు మఱేదీ కాదు, అది మేరు పర్వతమ్మీద ఉండేదీ దానికి రత్న కుసుమాలుండేవీ కనక ఫలాలుండేవీ మునులూ పుణ్యాత్ములూ దేవతలూ అడిగిన వరాలిచ్చేదీ అని చెప్తారు మన పెద్దలందరూ.

దేవతలే కాదు ఎవరడిగిన వరాలైనా ఇచ్చే **Giving Tree** అదీ, ఎక్కడో కాదు ఇక్కడే ఉందీ ప్రతి ఇంటా ప్రతి ఏటా ప్రతి **Christmas** కీ వెలుస్తుందీ అని ఋజువు చేస్తారు పాశ్చాత్యులందరూ. పిల్లల సరదా కాదనలేక అమెరికాలో అందటితో బాటు మేమూ (**Christmas**) కల్పవృక్షం పెట్టటం మొదలు పెట్టాం, కృష్ణుడూ క్రీస్తుడూ "సబకో సమ్మతి హై భగవాన్" అనుకున్నాం. ఎంత సరదా ఐతే మాత్రం అదేఁవిటిరా అప్రాచ్యప్పనీ అని తిట్టాడు మా కన్నా పదేళ్ళ క్రిందే అమెరికా వచ్చిన మా అన్నయ్య జంధ్యంతో వీపు గోక్కుంటూ. అన్నయ్య చాదస్తం లెస్తూ అని అప్పట్లో నవ్వుకున్నాను గానీ ఇప్పుడు తెలుస్తోంది "పెద్దలాడిన మాట చద్దియన్నపు మూటా" అని.

ధన్య వాద వారాంతం (**Thanksgiving weekend**) నుండీ మొదలౌతుంది కదనం[1]. ఏఁవండీ చెట్టు కిందకి దింపాలి అని మంద్ర స్థాయి లో మొదలైన ఆలాపనం, పైవారఁవన్నా దింపాలి ఈ వారఁవన్నా దింపాలి ఇవాళన్నా దింపాలి అంటూ చివరకి ఇవాళే దింపాలి అని తారస్థాయికి చేరుకుంటుంది "సారిమగారిస ఋీపమదాదని" ఫక్కీలో. ఇప్పుడు పైన చల్లగా ఉంటుంది రేపు మధ్యాహ్నం కాస్త వేడిగా ఉన్నప్పుడు దింపుతాను అని ఆఖరి వాయిదా ప్రయత్నం ముద్దాయి ద్వారా, లాభం లేదు రేపు మధ్యాహ్నం రాధ గారింటికి వెళ్ళాలి అదీ గాక ఇవాళైతే పిల్లలు కూడా ఉన్నారు పని జటిగిపోతుందీ అని జడ్జి గారి తీర్పు. నిజానికి పిల్లలింట్లో ఉండడం చాలా వీలిటుఁవంటి సమయాల్లో.

శ్రీకృష్ణుడెలా పెకలించుకొచ్చాడో గానీ మా కల్ప వృక్షాన్ని అటక (**attic**) మీంచి దింపడం మాత్రం బ్రహ్మ ప్రయత్నమే. అసలా పనికి ముందు తయారీలే ముప్పైమూడూ. పైన చల్లదనానికి కాళ్ళు కొంకర్లు పోతాయి కాబట్టి **sweat shirt, jeans** వేసుకోవాలి. కొండొకచో పొడుచుకొని వచ్చు మేకుల బారి నుండి రక్షణ కోసం కింద నుంచి **sneakers** తెచ్చుకోవాలి. పైన ఉన్న ఒక్క దీపం చాలదు కాబట్టి టార్చ్ లైట్ ఎక్కడ

---

[1] ఇక్కడ గానీ పైన మకుటంలో గానీ అప్పు తచ్చులేఁవీ లేవు మహాశయులారా.

పెట్టామో వెతుక్కోవాలి దాన్లో బాటరీలు చూసుకోవాలి. ఇక పైకి ఎక్కిన తరువాత దారిలో అడ్డం వచ్చే నాలుగు నాలుగు చిన్న సంచులూ (carry on bags) పెద్ద సూట్‌కేసులూ ఇండియా సైజు డెబ్భై పౌన్ల గంగాళాలూ పిల్లల పుస్తకాల పెట్టెలూ అన్నింటినీ ఏడుకొండలెక్కినట్లు ఎక్కుకుంటూ దాటుకుంటూ ఆ వృక్ష రాజాన్ని క్రితం సంవత్సరం ఎక్కడ పెట్టామో వెతకాలి. మధ్యే మధ్యే శిరమునకు దూలంబు పరంబగునప్పుడు శిరస్తాపమూ మనస్తాపమూ విభాషగానగునని గ్రహించాలి. చెప్పిన మాట విని పిల్లలు చిన్నప్పుడు వాడిన సైకిలు హెల్మెట్ పారేయకుండా ఉంటే ఇటువంటి సమయాల్లో చాలా ఉపయోగకరంగా ఉండేదీ అని మఱొక సారి ఒప్పుకోవాలి.

ఇలా కవచ కుండల కిరీట ధారినై దివి నుండి భువి మీదకి దానిని దింపిన తరువాత కార్యక్రమం వృక్షాలంకరణం. పిల్లలున్నారు గాబట్టి ఆ పనిలో మాత్రం కాస్త విడుదల. పిల్లలూ, ఆంటీ చేసే చామదుంప వేపుడు కోసం దేనికైనా సిద్ధమయ్యే వాళ్ళ ఫ్రెండు అర్వీషా, తనూ కలిసి తెల్ల దీపాలూ నీలి గోళాలూ ఎఱ్ఱ రిబ్బన్లూ అన్నీ ఏవి ఎక్కడుండాలో సోదాహరణంగా నిర్ణయించి సహేతుకంగా చర్చించి (తదర్థం దెబ్బలాడుకుని) మూడు గంటల పాటు నిర్విరామంగా కుస్తీ పట్టేసి ఆ పని పూర్తి చేశారు. అలా ఆ కలవృక్షాన్ని సర్వాంగ సుందరంగా తయారు చేసి వృక్షం‌విచ్చిన గుప్త వరాలన్నీ (wrapped gifts) చక్కగా అమర్చి అమ్మయ్యా అని అనుకునేటప్పటికి ఆవులింతలర్ధరాత్రయింది.

అప్పుడడిగింది మా అమ్మాయి, గుండెగుభేల్మనిపించి రాత్రికి నిద్రంతా పాడుజేసే యక్షప్రశ్న కుతూహలంగా, “నాన్నా ఇంతకీ అమ్మకేంకొన్నావూ” అని.